క్లుప్తంగా

ఘనంగా పాటేమ్మ తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని చెన్నంరాజుపల్లె గ్రామంలో వెలసిన శ్రీపాటేమ్మ తిరునాల ఉత్సవాలు గురువారం ఆలయ కార్యనిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అర్చకులు గణపతి పూజ, ఆకుపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

రేపటి నుంచి సంప్రోక్షణ

లింగాల : మండలంలోని కోమన్నూతల గ్రామంలో పురాతన శ్రీపాలేటి గంగమ్మ దేవస్థానం జీర్ణోద్ధరణ (పునర్నిర్మాణం) చేసిన సందర్భంగా శనివారం నుంచి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈనెల 24న దేవతామూర్తులకు పూజఫల సమర్పణ, రాత్రి శ్రీగణేశ పూజ, స్వస్తివాచన, పంచగవ్యం, శ్రీపాలేటి గంగమ్మ సంప్రోక్షణ అభిషేకం, దేవాలయ శిఖర కలశ స్థాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 25న ఉదయం 10 గంటలకు మహా ప్రసాద (అన్నదాన) కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని వారు కోరారు.

రామాలయం పునర్నిర్మాణం

సింహాద్రిపురం : మండల పరిధి బిదినంచర్ల గ్రామంలో అతి పురాతన రామాలయాన్ని గ్రామస్తులంతా కలిసికట్టుగా చందాలు వేసుకుని (జీర్ణోద్ధరణ) పునర్నిర్మించారు. దీంతో ఆ ఆలయం నూతన శోభ సంతరించుకుంది. గురువారం అర్చకులు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాకారుల చెక్కభజన కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది.

నివాళి



గంగిరెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని చౌటపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శనివారపు గంగిరెడ్డి(60) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లారు. గంగిరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, వీరారెడ్డి, క్రిష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, జగదీష్‌రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

పులివెందుల రూరల్ : పట్టణ పరిధి అంబకపల్లె రోడ్డులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉన్న విద్యుత్ భవన్ వద్ద శుక్రవారం విద్యుత్ అదాలత్, అవగాహన కార్యక్రమం ఉంటుందని విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురుమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్నా ఈ కార్యక్రమంలో తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల టౌన్, పులివెందుల రూరల్, లింగాల మండల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన కమిటీ

జమ్మలమడుగు : ఏపీఐఐసీ ఎర్రగుంట్ల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని నారరాయి పరిశ్రమ యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడ్వైజర్ కమిటీలో లక్ష్మీ సుజాత, వై.అంజనమ్మ, జి.పెద్దిరెడ్డి, కె.రామమునిరెడ్డి, వై.రామ ఓబులరెడ్డి, కె.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ జోనల్ మేనేజరుగా కమలాకర్, సర్వేయర్ ప్రసాద్ రెడ్డిలు కమిటీ సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కమిటీ ఆరు నెలల వరకు మాత్రమే కార్యనిర్వాహకులుగా ఉంటారని శ్రీనివాసమూర్తి సూచించారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న ఏపీఓ గంగరాజు

లింగాల : లింగాల మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులలో అక్రమాలు చోటు చేసుకున్నాయని కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ రసూల్ బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆరోపించారు. అలాగే ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. దీనిపై ఉపాధి హామీ ఏపీఓ గంగరాజు, కార్యాలయ సిబ్బంది ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహించారు. గురువారం పనుల వద్దకు వెళ్లి కూలీలను పరిశీలించి మస్టర్లలో పేర్లు ఉన్నవారు ఉన్నారా, లేరా అని తనిఖీలు చేశారు. మస్టర్లలో పేర్లు ఉండి పనులకు రాని వారికి హాజరు వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సత్యానంద తదితరులు పాల్గొన్నారు.

భజే వాయుపుత్రం.. శ్రీ ఆంజనేయం



పులివెందుల టౌన్ : ప్రత్యేక అలంకరణలో తూర్పు ఆంజనేయస్వామి



పులివెందులలో భారీగా హనుమాన్ శోభా యాత్ర



శోభాయాత్రలో ట్రాక్టర్‌పై కొలువు దీరిన ఆంజనేయస్వామి ఉత్సవమూర్తి

- వైభవంగా హనుమాన్ జయంత్యుత్సవం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న శోభాయాత్రలు

పులివెందుల టౌన్ : అంజనీ పుత్రుడు శ్రీ ఆంజనేయస్వామి జయంత్యుత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పులివెందుల పట్టణంలోని అన్ని అంజన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తూర్పు ఆంజనేయస్వామి, పడమటి ఆంజనేయస్వామి, కోతిసమాధి ఆంజనేయస్వామి, పీడబ్ల్యూబీ ఆంజనేయస్వామి, ఆర్‌ఆర్ స్ట్రీట్, బ్రాహ్మణపల్లె గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా శోభా యాత్ర

పులివెందుల పట్టణంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలోహనుమాన్ శోభ యాత్ర వైభవంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున కాషాయం జెండాలను పట్టుకుని నుదిటిన తిలకం దిద్దుకుని జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు. సాయంత్రం స్థానిక కొత్త బస్టాండు సమీపంలోని పీడబ్ల్యూబీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి శోభ యాత్ర నిర్వహించారు. గాంధీ సర్కిల్, కచేరి రోడ్డు, మెయిన్‌బజార్, పూలంగళ్ల సర్కిల్ మీదుగా కొత్త ఆర్టీసీ బస్టాండు వరకు బైకు ర్యాలీ, డీజే సౌండ్లతో శ్రీరాముడు, హనుమంతుని భక్తి పాటలతో చిందులేసుకుంటూ ముందుకు సాగుతూ భక్తిని చాటుకున్నారు. ఈ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, హాలు గంగాధరరెడ్డి, పార్నపల్లె కిశోర్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, చంద్రమౌళి, తదితరులతోపాటు కూటమి నాయకులు, ఉపాధ్యాయ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, హిందు సంఘాలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధి ఎర్రబల్లె పంచాయతీ మల్లికార్జునపురం గ్రామ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెక్కభజనలతోపాటు భజన బృందం ఆధ్వర్యంలో భజనలు, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు.

సింహాద్రిపురం మండలంలో..

సింహాద్రిపురం : మండలంలోని బలపనూరు, అంకాలమ్మ గూడూరు, నంద్యాలంపల్లె, కసనూరు, సింహాద్రిపురం సమీపంలోని నిడివెల్ల ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి విశేష అలంకరణతోపాటు ప్రత్యేక పూజలు చేశారు.

లింగాల మండలంలో..

లింగాల : మండలంలోని లింగాల, కర్ణపాపాయపల్లె, వెలిదండ్ల, పార్నపల్లె, ఎగువపల్లె, తాతిరెడ్డిపల్లె గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్నపల్లె కోన మల్లేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో వెలసిన ఆంజనేయస్వామి వారికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. 1008 అరటి పండ్లతో స్వామివారికి అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.

వేంపల్లె మండలంలో..

వేంపల్లె : వేంపల్లె మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి శోభా యాత్రను వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జమ్మలమడుగు మండలంలో..

జమ్మలమడుగు : మండల పరిధిలోని గండికోట రహదారిలో ఉన్న అభయాంజనేయ విగ్రహం వద్ద ప్రత్యేక యజ్ఞం నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడం కోసం జమ్మలమడుగు, మండల పరిధిలోని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

ఎర్రగుంట్లలో..

పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. నడివూరులో ఉన్న రామాలయం వద్ద నుంచి శోభాయాత్రను నిర్వహించారు.

ముద్దనూరు మండలంలో..

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుర్రప్ప అన్నదానం నిర్వహించారు. ముద్దనూరులోని వరదాంజనేయస్వామి, డీయస్‌పల్లెలోని బురుజు ఆంజనేయస్వామి, కొత్తపల్లెతోపాటు పలు గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు.

కమలాపురం మండలంలో..

కమలాపురం : కమలాపురం పట్టణంలోని మార్కెట్ వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి, బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ పిచ్చాంజనేయస్వామి ఆలయంతో పాటు గంగవరం, కోగటం, కుంట, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, రామాపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రగుడిపాడు -పందిళ్లపల్లె గ్రామాల మధ్య వెలసిన ఆంజనేయస్వామి గుడి వద్ద కార్యక్రమాలు నిర్వహించారు.

వీరపునాయునిపల్లె మండలంలో..

వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లె, వేంపల్లె, యర్రగుంట్ల ప్రధాన రహదారిలో సంగాలపల్లె వెలసిన ఆంజనేయస్వామి ఆలయం, యరమలపల్లె, బుసిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మూల మూర్తులతోపాటు ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించారు. వీరపునాయుపనిపల్లెలో ఒంటిగారి విద్యా సంస్థల అధినేత వెంకటసుబ్బానాయుడు ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

వల్లూరు మండలంలో..

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలను, ఆకు పూజలను నిర్వహించారు. గోటూరు అభయాంజనేయస్వామి ఆలయంలో మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి ప్రారంభించారు. వల్లూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వెంకటాపురం వీవర్స్ కాలనీలో రాత్రి స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కుమారునిపల్లె సమీపంలోని వరాల ఆంజనేయస్వామి, పాపాగ్ని నగర్‌లోని ఆంజనేయస్వామి, పైడికాలువ, చిన్న నాగిరెడ్డిపల్లె, లింగాయపల్లె గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలలో రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

చెన్నూరు మండలంలో..

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరులోని బ్రాహ్మణ వీధిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. చిన్నమాచుపల్లిలో శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో సీతారాముల వారి కల్యాణం నిర్వహించారు.



ఎర్రగుంట్ల : శోభాయాత్రలో ఆకట్టుకున్న కోలాటం



లింగాల : కోన మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆంజన్నకు 1008 అరటి పండ్లతో అర్చన



పులివెందుల శోభా యాత్రలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నాయకులు



కమలాపురం : అన్నదాన కార్యక్రమం



పులివెందుల శోభా యాత్రలో కలశాలతో మహిళలు

స్వామి ఆశీర్వాదంతో అందరూ సుభిక్షంగా ఉండాలి

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ఆంజనేయస్వామి జయంత్యుత్సవం సందర్భంగా పులివెందులలోని హనుమాన్ ఆలయాలలో గురువారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు పీడబ్ల్యూబీ కాలనీ, పడమటి ఆంజనేయస్వామి ఆలయాలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా అందరినీ ఆయన ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, వేల్పుల రాము, పార్నపల్లె కిశోర్, కోడి రమణ, సర్వోత్తమరెడ్డి, రసూల్, వీరారెడ్డి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, హిందూ ఐక్య వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ జూబ్లీ వేడుకలలో ఎంపీ

పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి పునీత జోజప్ప గారి దేవాలయం స్వర్ణ జూబ్లీ వేడుకలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ చర్చి స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. పేద ప్రజలందరికీ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, నెల్లూరు డయాసిస్ బిషప్ రెవరెండ్ ఎండీ ప్రకాష్, చిత్తూరు, కడప డయాసిస్ బిషప్ సగినాల పాల్ ప్రకాష్, విచారణ గురువు ఆరోగ్య స్వామి, రోమన్ క్యాథలిక్ గురువులు, ఫాదర్లు, పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.



పడమటి ఆంజనేయస్వామి ఉత్సవమూర్తి వద్ద ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డిలను సత్కరిస్తున్న చర్చి ఫాదర్లు

31న సిద్దేశ్వరం సభను జయప్రదం చేయండి

పులివెందుల రూరల్ : నంద్యాల జిల్లాలో ఈ నెల 31న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవ సభ సంగమేశ్వరం వద్ద నిర్వహించనున్నట్లు రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట గురువారం రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఈ సభకు సంబంధించిన పోస్టర్లను విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదని, అన్ని ప్రాంతాలు అనే విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా రాయలసీమ తాగు, సాగునీటికే పరిమితం చేయాలని, కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. హంద్రీనీవా, తెలుగుగంగ, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులు మూడేళ్లలో పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేయాలని కోరుతూ ఈనెల 31న సంగమేశ్వరం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, యువకులు, కవులు, రచయితలు మేధావులు, రైతులు, కార్మికులతో పాటు సాధారణ ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి నాయకులు రాఘవేంద్రారెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్‌వీఎస్, విద్యార్థి సంఘాల నాయకులు

28న మోడల్ డీఎస్సీని విజయవంతం చేయండి

కమలాపురం : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28న డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పరీక్షను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ రావు చేత ఈ ప్రశ్నా పత్రం తయారు చేయించినట్లు పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ఎంట్రెన్స్ రాసే నిరుద్యోగులకు ఈ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పరీక్ష కేవలం ఎస్‌జీటీ అభ్యర్థులకు మాత్రమేనని, ఆసక్తి గల వారు రూ.50 ప్రవేశ రుసుం చెల్లించి 99127 58515 నంబర్‌కు సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే కడపలోని వెంకట సాయి కోచింగ్ సెంటర్, యూటీఎఫ్ భవన్‌లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మోడల్ పరీక్ష కూడా అక్కడే జరుగుతుందని వివరించారు. సమావేశంలో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నెలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని గురువారం కమలాపురం శాసనసభ్యుడు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడతల వారీగా రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి తర్వాత కుట్టు మిషన్ల పంపిణీ చేయడం జరుగుతుందనిని, ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశం కలుగుతుందని తెలిపారు. అనంతరం శాసన సభ్యులు కృష్ణచైతన్యరెడ్డి ఆజాద్ నగర్‌లో ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుల్లాయిబాబు, చింతకొమ్మదిన్నె సర్పంచ్ మహేశ్వరి, తెలుగుదేశం నాయకులు గంధం మోహన్ కృష్ణారెడ్డి, కంది మహేశ్వర్‌రెడ్డి, రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

దివ్యాంగ విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

వేంపల్లె : దివ్యాంగ విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ పి.లక్ష్మీనరసింహరాజు పేర్కొన్నారు. వేంపల్లెలో గురువారం దివ్యాంగ విద్యార్థుల నమోదుపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 10వ తేదీ వరకు దివ్యాంగుల సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 18 ఏళ్ల లోపు దివ్యాంగ చిన్నారులు పాఠశాలలో ఇంకా నమోదు కానీవారు బడి బయట ఉన్న చిన్నారులు, 5 ఏళ్లలోపు దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారిని భవిత సెంటర్లలో చేర్పించాలన్నారు. ప్రస్తుతం మండలంలో 8 మందిని కొత్తగా గుర్తించినట్లు ఐఈఆర్టీ యశోద తెలిపారు. భవిత కేంద్రం ద్వారా అలవెన్స్ ఆపరేషన్లు, ఉపకరణాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు యశోద, సుజాత, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లెలో సర్వే నిర్వహిస్తున్న ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్, ఐఈఆర్టీలు

గిరిజనులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

కొండాపురం : మండలంలోని దళిత, గిరిజనులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.మనోహర్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం దళిత నాయకులతో కలిసి ఆయన ఎంపీడీఓ నాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గండికోట ప్రాజెక్టు కింద సర్వం కోల్పోయిన ప్రజలకు తక్షణమే ఉపాధి నైపుణ్యం కింద ఉచిత కుట్టుమిషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలకు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాల యూనిఫాం కుట్టే పనిని వీరికి ఇచ్చే విధంగా చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రుణాలు గ్రామీణ ప్రాంతాల వారికి ఉపయోగపడే విధంగా అమలు చేయాలన్నారు. పశువులు, గొర్రెల పెంపకం, కిరాణ దుకాణాలు, చిన్నపాటి హోటళ్లకు రుణాలు ఇచ్చే విధంగా చేసి వాళ్లను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నాగసుబ్బరాయుడు, నారాయణ, ఓబుయ్య, శామ్యూల్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)కు శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు రానున్నారు. చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దాలు, కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుట, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట తదితర చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

పరామర్శ

కొండాపురం : ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి(88) ఇటీవల మృతి చెందారు. కొండాపురంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే పెంచలయ్య గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులు, సినీ నటుడు వేల్పుల వెంకటరాజ్‌కుమార్, రమాదేవి, ద్వారకనాథరెడ్డి, ఇందిరమ్మ, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులతో మాట్లాడి తమ సానుభూతి తెలిపారు. జెడ్పీ చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాజకీయ నాయకుడు, పారిశ్రామిక వేత్తగా ఎంతో మందికి ఉపాధి కల్పించారని పేర్కొన్నారు.

నీటి తొట్లు ఏర్పాటు

వల్లూరు : మూగజీవులైన పక్షులు, జంతువుల దాహార్తిని తీర్చడం కోసం రేపటి మార్పు కోసం యూత్ సంఘం ఆధ్వర్యంలో వల్లూరు గ్రామంలో నీటి తొట్లను ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, ఇతర సంఘ సభ్యులతో కలిసి ఎస్ఐ పెద్ద ఓబన్న గురువారం తొట్లకు నీటిని పట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూగజీవులకు దాహం తీర్చడానికి నీటి తొట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమాలను మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రేపటి మార్పు కోసం యూత్ సభ్యులు పాల్గొన్నారు.